క్లుప్తంగా

తెనాలిలో పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వారి అభిమానుల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో సోమవారం పేదలు, యాచకులకు అన్నదానం చేశారు. ముందుగా జన్మదిన కేక్‌ను కట్ చేసి జూనియర్ ఎన్టీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నిర్వాహకులు వెంకటచౌదరి, బాషా జాన్‌లు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మడి భార్గవ్, కొత్తపల్లి సాయికృష్ణ, బాషా తలైవా, తదితరులు పాల్గొన్నారు.

25న ఆహ్వానం లక్ష్మి సంస్మరణ



తెనాలి: ఆహ్వానం మాసపత్రిక సంపాదకురాలు ఎస్ ఎస్ లక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనె 25న తెనాలిలో సంస్మరణసభను నిర్వహించనున్నారు. ఆహ్వానం లక్ష్మిగా సాహితీ లోకంలో గుర్తింపును పొందిన ఆమె గతేడాది మృతి చెందారు. ఆమెకు నివాళిగా పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఏడాదిపాటు ప్రతినెల ఒక మంచి పుస్తకంపై చర్చ నిర్వహించిన విషయం తెలిసిందే. చర్చలు ముగిసిన సందర్భంగా 25వ తేదీన ప్రథమ వర్ధంతి సంస్మరణను ఏర్పాటు చేశారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే సభకు జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయితలు / కవులు వాడ్రేవు వీరలక్ష్మీదేవి, పాపినేని శివశంకర్, కాట్రగడ్డ దయానంద్, బండ్ల మాధవరావు, సమయం రాజా సంజీవదేవ్ పాల్గొంటారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు



గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు ఉన్నత చదువులు అభ్యసించాలని యువనారీ హెల్త్‌కేర్ ట్రస్టు చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. వరంగల్ హనుమకొండలో షాహీన్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఏ కోర్సు చేస్తే ఉపాధి అవకాశాలు ఉంటాయనే అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని చెప్పారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో వారు ఎంచుకునే గ్రూప్స్ పైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి పదోతరగతి వరకు చదివింది ఒక ఎత్తయితే ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదవడంపై వారి బంగారు భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆత్మ సంయమయోగః ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత – ఆత్మసంయమయోగః ధారావాహిక ప్రవచన కార్యక్రమాలు మొదలయ్యాయి. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో సువీరానందస్వామి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 వరకు నిర్వహించనున్నారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సువీరానందస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో సన్యాసమని పిలిచినది యోగమని తెలుసుకోవాలని అన్నారు. సంకల్ప త్యాగం చేయని వారు ఎవరూ యోగి కాలేరని పేర్కొన్నారు.

ఉండవల్లి సెంటర్‌లో వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో ఓ వ్యక్తి మృతిచెందడంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్ కాలనీ (యానాదుల కాలనీ)కి చెందిన బొజ్జా కృష్ణయ్య (26) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆదివారం సాయంత్రం ఉండవల్లి సెంటర్‌లో మృతి చెందడంతో భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెనాలి చేరిన 66,348 నోట్ పుస్తకాలు

- త్వరలో పాఠ్యపుస్తకాలు రాక
- ఇప్పటికే ఇండెంట్ పంపిన విద్యాశాఖ
- పాఠశాలలు పునః ప్రారంభం కాగానే పంపిణీ

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కాకముందే తెనాలికి నోట్ పుస్తకాలు వచ్చాయి. సుమారు 70 వేల నోట్ పుస్తకాలు తెనాలి ప్రాంతానికి అవసరం. అయితే ఉన్నతాధికారులు ఇప్పటికే 66,348 నోట్ పుస్తకాలను పంపారు. మిగిలిన వాటిని త్వరలో పంపనున్నారు. అలాగే తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల ఇండెంట్‌ను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశారు. వాటిని కూడా కొద్దిరోజుల్లో తెనాలి పంపనున్నట్లు సమాచారం.

తెనాలి పట్టణ పరిధిలో 50 మున్సిపల్ పాఠశాలలు, రెండు ట్రైబల్ స్కూల్స్ ఉన్నాయి. తెనాలి మండల పరిధిలో 47 మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదోవ తరగతి వరకు గతేడాది 10,477 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. వీరికి పంపిణీ చేసేందుకు 70 వేల నోట్ బుక్స్, 1,68,936 టెక్స్ బుక్స్‌ను గతేడాది తెనాలి పంపింది. ఈ ఏడాది కూడా ప్రస్తుతం అదే సంఖ్యలో టెక్స్, నోట్ బుక్స్ పంపేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. దానిలో భాగంగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టి వాటి రూపురేఖలు మార్చారు. అలాగే విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి కింద ఏడాదికి రూ.15 వేల నగదు జమ చేయటం, విద్యార్థులకు అవసరమైన నోట్, టెక్స్ బుక్స్, షూస్, సాక్సులు వంటి వాటిని జగనన్న విద్యా దీవెన కింద విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందించింది. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ప్రారంభించారు. అలాగే పదోవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ పెట్టటం వంటి చర్యలు చేపట్టడం వలన ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది. దీంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న చిన్నచూపు తొలగి తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. దీంతో ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది.

నోటు పుస్తకాలు

తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు 70 వేల నోట్, 1,68,936 పాఠ్య పుస్తకాలు అవసరం అని అధికారులు నిర్ధారించారు. అదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో ఉన్నతాధికారులు ఈ నెల మొదట్లోనే తెనాలికి అవసరమైన 70వేల నోట్ పుస్తకాలలో 66,348 ఇప్పటికే తెనాలి పంపింది. మిగిలిన వాటితో పాటు పాఠ్య పుస్తకాలు కూడా కొద్దిరోజుల్లో తెనాలి పంపనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జూన్ 12 పాఠశాలల పునః ప్రారంభం నాటికి అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయని అధికారులు చెపుతున్నారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అందుకు అనుగుణంగా నోటు, పాఠ్య పుస్తకాలు తెప్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను పునఃప్రారంభం నాటికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.



తెనాలి చేరిన నోటు పుస్తకాలు



నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతి బాబు

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘననివాళి

లక్ష్మీపురం: ఎక్కడ ప్రమాదం ఉందో అక్కడ ప్రకాశం .. ఎక్కడ ప్రజలు ఉంటే అక్కడ ప్రకాశం అనేలా సమాజాభ్యుదయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహామనిషి టంగుటూరి ప్రకాశం పంతులు అని విద్యావేత్త ఇనుపులపాటి చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి మనోఫలకం పై చిరస్మరణీయంగా నిలిచిన ఉద్దండమూర్తి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. విశ్రాంత అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ అత్యంత నమ్మకంతో తన నిజమైన వారసుడిగా ప్రకాశం పంతులును గుర్తించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు నివాళులర్పించారు.



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొండాశివరామిరెడ్డి

నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య..

లక్ష్మీపురం: ప్రజా క్షేమమే పరమావధిగా ఉద్యమమే ఊపిరిగా ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం గడిపిన నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సోమవారం అవగాహన సంస్థ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ సీనియర్ సభ్యులు సదాశివంలు పాల్గొన్నారు.

ఎనిమిది నెలల పసికందుకు అరుదైన చికిత్స

గుంటూరు మెడికల్: పుట్టుకతోనే కంజినేటల్ ఈజోఫాజల్ వెబ్ సమస్యతో బాధపడుతున్న ఎనిమిది నెలల పసికందుకు అరుదైన చికిత్స చేసినట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి చెప్పారు. సోమవారం గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా నగరం మండలం చిన మట్లపూడి గ్రామానికి చెందిన ఎం.శ్రావణి, విజయకుమార్‌లకు ఎనిమిది నెలల క్రితం బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు అన్నవాహిక ప్రారంభదశలో గొంతులోపల పొర ఏర్పడి తల్లి నుంచి తాగే పాలు పొట్టలోకి వెళ్లకుండా ముక్కు ద్వారా బయటకు వచ్చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించినా సమస్య నిర్ధారణ జరగక ఈనెల 16న తమ హాస్పటల్‌కు వచ్చారని డాక్టర్ సిద్ధార్థరెడ్డి చెప్పారు. పరీక్షలు చేసి పసికందు కంజినేటల్ ఈసోఫాజల్ వెబ్ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి సమస్య 50 వేల జననాల్లో ఒకరికి వస్తుందన్నారు. అన్నవాహిక ప్రారంభదశలో గొంతుకు అడ్డుగా ఉన్న పొరను ఎలాంటి ఆపరేషన్ చేయకుండా ఈనెల 17న ఎండోస్కోపి ద్వారా ఎస్‌జీ డైలటేషన్ చేసి కేవలం 15 నిమిషాల వ్యవధిలో తొలగించామన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆళ్ల

భూసార పరీక్ష రైతన్నకు వరం

- పంటలకు మేలు
- పంట నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాలను బట్టి ఎరువుల వినియోగంతో ఖర్చు తగ్గుముఖం
- అధిక దిగుబడులకు అవకాశం

కొల్లిపర: రైతులు సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, అమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. దీంతో స్థానిక ఆర్బీకే కేంద్రాల్లో వ్యవసాయాధికారులు సిఫారసు మేరకు సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు సాగు భూమిలో ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చు తెలియజేయటం వల్ల అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతుంది. భూమి సేద్యానికి అనువుగా లేని పక్షంలో, ఎలా బాగు చేసుకోవాలి, ప్రత్యామ్నాయంగా ఏం రసాయనాలు ఎలా వాడాలో మట్టి పరీక్షలు ద్వారా అధికారులు రైతులకు సూచిస్తారు. లేదా పరీక్ష ఫలితాలు ద్వారా రైతులకు అవగాహన పెరుగుతుంది.

తెనాలి నియోజకవర్గంలో 27 వేల ఎకరాలు

తెనాలి నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలంలో ఈ రబీ సీజన్‌లో 27 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. తెనాలిలో 13,533, కొల్లిపరలో 12,482 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు.

మట్టి నమూనాలు తీయడం ఇలా..

వరి, జొన్న సాగు చేసే పంటలకు ఆరు అంగుళాలు లేక 15 సెంమీ లోతులో వీ(ఇంగ్లిష్ అక్షరం) ఆకారంలో గొయ్యి తీయాలి. పండ్ల తోటలకు 5 అడుగుల గొయ్యి తవ్వి, అడుగుకు ఒకటి చొప్పున 5 నమూనాలు తీయాలి



కొల్లిపర మండలంలో మట్టి నమూనా సేకరిస్తున్న ఏఓ వెంకటరావు (ఫైల్)

నీటి నమూనా సేకరణ ఇలా...

బోరు వదిలిన అరగంట తరువాత నీటి నమూనా సేకరించాలి, బావి నుంచి సేకరిస్తే, మధ్య నుంచి నీరు సేకరించాలి, నీటి నమూనా సేకరించిన 24 గంటల్లోగా పరీక్ష కేంద్రానికి చేర్చాలి.

భూసార పరీక్షలు ఇలా

వ్యవసాయాధికారులు మట్టి నమూనాలను పరీక్షించి ఆ భూమిలో ఏ పంటలు వేయాలి, వేయాల్సిన ఎరువుల మోతాదు, ఇతర సూచనలను భూసార పరీక్ష కేంద్రాలల్లో పరీక్షలు చేసిన తరువాత ఒక కార్డు ద్వారా రైతులకు తెలియజేస్తారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రంలో ఆరు రకాల పరీక్షలు చేస్తారు. అవి....

నేల స్వభావం

భూసార పరీక్షల్లో నేల స్వభావం అంటే తేలిక నేల, మధ్యరకం లేదా బరువు నేలగా గుర్తించి తెలియజేస్తారు. తేలికనేల అంటే రైతు పొలం ఎక్కువ ఇసుకతో కూడుకుని, చాలా తక్కువ బంక మట్టి కలిగి ఉంటుంది. బరువు నేల అంటే తక్కువ ఇసుక కలిగి, ఎక్కువ బంకమట్టి కలిగి ఉంటుంది. మధ్యస్థ నేలలో ఇసుక, బంకమట్టి ఇంచుమించు సమాన పాళ్లలో ఉంటాయి.

లవణాల సాంద్రత

రైతుల పొలాల్లో సోడియం, కాల్షియం, మెగ్నీషియం మొదలైన నీటిలో కరిగే పలు రకాల లవణాలుంటాయి. వీటి సాంద్రత ఎంత మోతాదులో ఉందో భూసార పరీక్షల ద్వారా తెలుసుకుని, వాటి విలువలను పొందుపరుస్తారు. నీటిలో కరిగి ఉన్న లవణాల సాంద్రత, సామాన్యంగా ఉందా, మొలకెత్తటానికి వీల్లేకుండా ఉందా లేదా పంటలకు హానికరంగా ఉందా అనే విషయాలు తెలుసుకోవచ్చు.

ఆమ్ల, క్షార లక్షణం

దీనినే ఉదజని సూచిక అంటారు. ఈ పరీక్ష ద్వారా రైతు పొలం ఆమ్లం, తటస్థం లేదా చౌడు గుణాల్లో దేనికి సంబంధించినదో తెలియజేస్తారు.

సేంద్రియ కర్బనం

ఈ పరీక్ష ద్వారా నేల ఉత్పాదక శక్తి సేంద్రియ పదార్థ మోతాదు ఎంత ఉందో తెలుస్తుంది. కార్బన్‌లో సేంద్రియ కర్బనం తక్కువ లేదా మధ్యస్థ లేదా ఎక్కువ ఉన్నది తెలుస్తుంది. తక్కువ, మధ్యస్థంగా ఉంది అని తేలితే కంపోస్టు ఎరువు ఏ మోతాదు వేయాలో ఫలితాల్లో తెలియజేస్తారు.

లభ్య భాస్వరం

నేలలో ఎంత మోతాదులో భాస్వరం పోషక పదార్థం ఉంది. పరీక్ష ద్వారా తెలుసుకొని తక్కువా, మధ్యస్థమా, ఎక్కువా అనేది ఫలితాల్లో తెలుపుతారు.

లభ్య పొటాష్

నేలలో ఎంత మోతాదులో పొటాష్ పోషక పదార్థం ఉంది తెలుసుకుని, తక్కువా, ఎక్కువా, మధ్యస్థమా అనేది ఫలితాల్లో తెలియజేస్తారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

- పొలంలో పంట ఉన్నప్పుడు మొక్కల వరుసల మధ్య తీయాలి
- అతి సారవంతమైన చోట్ల నుంచి కానీ, అతి నిస్సారమైన చోట్ల నుంచి కానీ మట్టి తీసి , ఒకే నమునాగా కలపరాదు.
- రసాయనికి ఎరువులు వేయగానే మట్టి నమూనాలు తీయరాదు.
- గట్ల పక్కన, చెట్ల కింద , చిత్తడి నేలల్లో , బండ్ల బాటల దారిలో , మెరక పల్లాల్లో , పెంట పోగులు వేసిన చోట్ల మట్టి నమూనాలు తీయరాదు.
- మట్టి నమూనాలు నింపు సంచులు రసాయన ఎరువులతో సంబంధం లేనివి ఉండాలి.
- మట్టి నమూనాలు బూడిద, చీకుడు ఎరువులతో సంబంధం ఉండేలా ఉంచరాదు.

ఎన్నో లాభాలు

- భూసార పరీక్షతో సమతుల్య పోషక పదార్థాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చు.
- ఎరువులను సమర్థవంతంగాను. పొదుపుగాను వినియెగించవచ్చు.
- భూసారాన్ని కాపాడవచ్చు.

నేడు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జయంతి

తెనాలిఅర్బన్: శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి వేడుకలను తెనాలి నాజర్‌పేటలో వేంచేసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకాలు, స్వామివారిని అలంకరించి మూలమంత్రంలో హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు సహస్ర నామార్చన, 22వ తేదీన స్వామివారికి 108 బిందెల పానకంతో అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృప, కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. అభిషేకాల్లో పాల్గొనే భక్తులు ముందుగా తమ గోత్రం పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

భర్త, అత్తమామలే మృతికి కారణమంటూ మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు



తాడికొండ: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుళ్లూరు గ్రామానికి చెందిన గొడవర్తి డేవిడ్ పెద్ద కుమార్తె సుకన్య(26)కు రాయపూడి గ్రామానికి చెందిన విజయ్ బాబుకు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. తదనంతరం భార్యభర్తలు విజయవాడలో కాపురం పెట్టగా ఇటీవల కాలంలో రాయపూడిలోని భర్త ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తుళ్లూరు పుట్టింటికి వచ్చిన సుకన్య ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తుళ్ళూరు సీఐ అనురాధ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా.. గత కొంత కాలంగా అత్త, మామ, భర్త కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి 7 నెలల పాప ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనురాధ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

ఫిరంగిపురం: విద్యుత్‌షాక్‌తో గొర్రెలకాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంపతి వెంకటేశ్వర్లు(65) తన వద్దనున్న మేకలను తోలుకొని సమీపంలోని పొలాల వద్దకు మేతకు తీసుకువెళ్లాడు. కర్రకు కొడవలి కట్టి చెట్టు పైనున్న కొమ్మలు కోస్తూ ఉన్న క్రమంలో విద్యుత్ తీగలకు కొడవలి తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడనే మృతి చెందాడు. కుమారుడు కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

చిరస్మరణీయుడు కొల్లి నాగేశ్వరరావు

సీపీఐ కార్యాలయంలో నివాళులర్పించిన రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం: ప్రముఖ రైతు ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సీపీఐ నాయకులు అమరజీవి కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం జరిగింది. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైతు సంఘ సీనియర్ నాయకుడు పాపారావు మాట్లాతూ పత్తి రైతుల కోసం సుప్రీంకోర్టు దాకా వెళ్లి పోరాడిన ఘనత కొల్లి నాగేశ్వరరావుకు దక్కుతుందన్నారు. నదీ జలాల అనుసంధానం కోసం పోరాటు చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘం నాయకులు పుప్పాల సత్యనారాయణ, కంజుల విఠల్ రెడ్డి, ముప్పాళ్ల శివశంకరరావు, పి.జగన్నాథం, యువజన, కార్మిక సంఘం నాయకులు జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, కాయల రామారావు, డేగల వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.



నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పాపారావు, సీపీఐ నాయకులు

అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి

తాడేపల్లిరూరల్ : ప్రజల ప్రియతమ నేత, అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎంటీఎంసీ పరిధిలోని మండడం, ఇందిరానగర్ టిడ్కో గృహాల వద్ద ఘపంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష అంతానికి సుందరయ్య విశేష కృషి చేశారని, తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాటాన్ని నడిపి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించారని, పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేతగా ప్రజాసమస్యలను పార్లమెంట్‌లో ఎలుగెత్తి చాటిన వ్యక్తి అని అన్నారు. ఎర్రజెండాకే వన్నె తెచ్చిన సుందరయ్య ఆశయాల స్ఫూర్తితో ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుంభ ఆంజనేయులు, సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు గద్దం కృష్ణ, నందా, జీఎం నాగరాజు, వెంకేటష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎం.రవి

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవిశిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్ సోమవారం తెలిపారు. ఉదయాన్నే పలు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, ఆంగ్లవ్యాకరణం, చదరంగం, క్యారమ్స్ ఆడటం వంటివాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలనుంచి 11గంటలవరకు శిక్షణ ఉంటుందన్నారు. డి.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాలపైకి పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రామీణ ప్రాంతవాసులకు అవగాహన కల్పించిన ఆర్పీఎఫ్ పోలీసులు

లక్ష్మీపురం: రైలు పట్టాలపై మూగ జీవాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే మూగ జీవాలతో పాటు రైలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణ దాసు తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని పెదకూరపాడు పరిసర ప్రాంతాలలో తాను.. రెడ్డిపాలెం, సిరిపురం పరిసర ప్రాంతాలలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు పశువుల కాపురులకు గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ సీఐ ఆర్.వీరబాబు ఆదేశాల మేరకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ పశువులను, మూగ జీవాలను రైలు పట్టాలపై రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. రైలు పట్టాలపై మూగ జీవాలను నిర్లక్ష్యంగా వదిలేస్తే, దాని వల్ల కలిగే ప్రమాదాలకు రైలు రాకపోకల ఇబ్బందులకు పశువుల యజమానులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పశువుల కాపురులకు పలు మార్లు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పోలీసుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరగుతుందన్నారు. ఇటీవల పెదకూరపాడు, బండారు పల్లి, సిరిపురం ప్రాంతాల్లోని రైలు పట్టాలపై పశువుల పడి మృతి చెందడం జరిగిందన్నారు. ఈ ప్రమాదం జరగడం ద్వారా రెండు రైళ్ల రాకపోకలు నిలిచి పోవడం జరిగిందన్నారు. పశువులను రైలు పట్టాలపై వదిలిన యజమానులైన ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.



పశువుల కాపరులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణదాసు

నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దుదాం

- అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి
- తాడేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ప్రతి వాడలోను పెద్దలను, మహిళలను కలిసి అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలని కోరుతూ, ప్రజలకు భరోసా ఇస్తూ సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంపై సీఐ కల్యాణ్ రాజ్ మాట్లాడుతూ తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రజలకు అప్రమత్తం చేసేందుకు ప్రతి ప్రాంతంలో తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారన్నారు. తాడేపల్లి రెండు మహానగరాల మధ్య ఉండడం, శరవేగంగా అభివృద్ధి చెందడం, పలు కళాశాలలు ఉండడంతో యువతీ యువకులు ప్రతిరోజు వస్తున్నారని, అందులో కొంతమంది అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్నారని తమకు సమాచారం ఉందన్నారు. ప్రజల కళ్లముందు జరుగుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మాకెందుకులే అనుకుంటున్నారని, చివరకు అక్కడ వున్న ప్రజలే ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తుగా అక్కడ వున్న ప్రజలు పోలీసులకు సమాచారం ఇస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని, ప్రజలకు పోలీసుల నుంచి భరోసా కల్పించేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ప్రాంతంలో విస్తృతంగా పర్యటిస్తూ నలుగురైదుగురు ఉన్న చోట్ల అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారు ఏ విధంగా ప్రవర్తిస్తారు? వారిని మనం ఏ విధంగా గుర్తించాలి? వారి గురించి పోలీసులు ఏ విధంగా సమాచారం ఇవ్వాలనే అంశాన్ని వివరిస్తున్నామన్నారు. ఏ ప్రాంతానికి ఏ కానిస్టేబుల్ వెళతారో వారి నెంబరే స్థానికంగా ఉన్న పెద్దలకు అందజేస్తున్నారని, వారి నెంబర్‌తో పాటు పోలీస్‌స్టేషన్ నెంబర్, ముగ్గురు ఎస్ఐల నెంబర్లు కూడా తెలియజేస్తున్నామన్నారు. వారు ఫోన్ చేసిన 10 నిమిషాల్లో సంఘటనా స్థలానికి వెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.